ప్రజాశక్తి

సమావేశంలో మాట్లాడుతున్న జంగాలపల్లి పెద్దన్న

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని ఎపి రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో శనివారం మారుతి అధ్యక్షతన ఎపి రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా హాజరై మాట్లాడారు. పరిశ్రమలు, సోలార్ ప్లాంట్లు, ఎస్ఈజెడ్(సెజ్) పేర్లతో దళితులు, గిరిజనులు, పేద రైతుల భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మండ లాలు, గ్రామాల్లో తిరుగుతూ రైతులను చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. రైతుల భూములు రైతులకే దక్కేలా, కార్పొరేట్ వ్యవస్థను వ్యతిరేకిస్తూ ముందుకుపోతామన్నారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో గత ప్రభుత్వం అనర్హులకి ప్రభుత్వ భూములు కేటాయించి, నిజమైన రైతులకు అన్యాయం చేసిందన్నారు. వీటిపై రెవెన్యూ అధికారులు విచారణ చేయాలని, అధికార బలంతో జరుగుతున్న భూసేకరణను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ధర్మవరం రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి ఎ.మారుతి, సహాయ కార్యదర్శిగా చెన్నారెడ్డి, కోశాధికారిగా రవి, సభ్యులుగా చిన్నరాయుడు, శివారెడ్డి, నర్సింహారెడ్డి, గుడ్లూరు పోతలయ్య, గరడంపల్లి పోతలయ్య, చంద్రశేఖర్, నారాయణస్వామిలను ఎన్నుకున్నారు.

దీపావళి మాటున చీకటి వ్యాపారం..!

- అమ్మకాల్లో నిబంధనలు గాలికి
- అధికారులకు విలువైన గిఫ్ట్‌బాక్స్‌లు
- దుకాణాల వద్ద కనిపించని ఫైర్ వాహనం

ప్రజాశక్తి-కదిరి టౌన్

దీపావళి పండుగ సందర్భంగా వ్యాపారులు ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తున్నట్లు కొనుగోలుదారులు వాపోతున్నారు. దీపావళి పండుగ వచ్చిందంటే చాలు కొందరు స్వార్థపరులు కాసుల పంట పండించుకోవటానికి పోటీపడతారు. పండుగ పూట వ్యాపారాలు మాత్రం కొండంత చేసి పన్ను చెల్లింపు మాత్రం గోరంత చేస్తారు. ఈ వ్యాపారం నిర్వహణకు సాయం పేరుతో కొందరు దళారులు మధ్యస్థం చేసి అధికారులకు విలువైన గిఫ్టులు పంపుతుంటారు. అధికారుల అండతో టపాసుల విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలకు పాతర వేస్తున్నారు. టపాసుల విక్రయ కేంద్రం వద్ద కనీస జాగ్రత్తలు కూడా ఏర్పాటు చేయకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. కదిరి పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద మంచుకైనా జాగ్రత్తలు పాటించకుండా అమ్మకాలు చేస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది. ఒక షాపుకు అనుమతి పొంది అదే పేరుతో ఒక్కోక్కరు నాలుగైదు షాపులను నిర్వహిస్తున్నారు. దుకాణదారులు లక్షల రూపాయల విలువ చేసే టపాసులు కొనుగోలు చేసి, తక్కువ మొత్తంలో కొనుగోలు చేసినట్లు బిల్లులు చూపిస్తున్నారు. దీంతో భారీ ఎత్తున పన్నులను ఎగ్గొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం కదిరి పట్టణంలోని బాణసంచా దుకాణం వద్ద రాత్రి వేళలో కొన్ని దుకాణాల యజమానులు బయటి వ్యక్తులు కలిసి మద్యం సేవిస్తూ సిగరెట్లు తాగుతూ పోలీసులకు పట్టువబడ్డారు.

టపాసుల దుకాణం వద్ద గిఫ్ట్ బాక్స్ లు తీసుకుంటున్న ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది

అధికారులకు విలువైన బహుమతులు

దీపావళి సందర్భంగా కదిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల వ్యాపారస్తులు నిబంధనలు తుంగలో తొక్కి అమ్మకాలు చేస్తున్నారు. దుకాణంకు దుకాణంకు మధ్య ఐదు అడుగులు వదలాల్సి ఉండగా దీనిని పాటించడం లేదు. నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులు కనీసం కన్నెత్తి చూడడం లేదు. దీపావళి పండగ వేళ ఆర్డీవో వివిఎస్ శర్మ కార్యాలయ సిబ్బంది ఆయన పేరు చెప్పుకుని ఓ దుకాణ దారుడు సహకారంతో వ్యాపారుల నుంచి సమాళ్ల పర్యానికి తెరలేపిటనట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. నిబంధనల అమలులో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారన్న విమర్శలున్నాయి.

రెవెన్యూ శాఖ స్టిక్కర్ ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న టపాసులు

కనిపించని సేల్స్ టాక్స్ అధికారులు

కదిరి పట్టణం లో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాదారులు ప్రజల్ని అధిక ధరలతో నిట్టనిలువ దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రతి ఏడాదీ గిఫ్ట్ బాక్స్‌లు మామూళ్లకు అలవాటు పడిన అధికారులు అటుపైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ సారి కూడా అదే పరిస్థితి కన్పిస్తోంది.

నిబంధనలు అమలు చేయాలి

కదిరి పట్టణంలో 33 దుకాణాలకు అనుమతులు మంజూరు చేశాం. బాణ సంచా కేంద్రాల నిర్వాహకులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

మాబుసుబహాన్, ఫైర్ అధికారి కదిరి.

విద్యుత్ కార్మికుల సమ్మె విరమణ శోచనీయం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్.నరసింహులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యుత్ కార్మికుల ప్రధాన డిమాండ్లు పరిష్కరించకుండా సమ్మె విరమించడం శోచనీయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్ నరసింహులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల రెగ్యులర్, గ్రేడ్-2 సమస్యలు, పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, తదితర డిమాండ్లతో జెఎసి సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. అవి నెరవేరకుండా మధ్యలో జెఎసి విరమించుకోవడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు రెండు మూడు పెన్షన్లు ఇస్తున్నారు.. వారికి అడ్డురాని చట్టాలు ప్రాణాలకు తెగించి పని చేస్తున్న విద్యుత్ కార్మిక, ఉద్యోగులకు అడ్డు వస్తాయా అని ప్రశినంచారు. ఇకనైనా యాజమాన్యం, ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే విధానాలకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రధాన డిమాండ్స్ నెరవేరే వరకూ దశల వారీగా ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

24న చలో విజయవాడ

ప్రజాశక్తి-హిందూపురం

ఎస్టీ కుల నకిలీ ధ్రువపత్రాలతో విద్య, ఉద్యోగ అవకాశాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కెబి.శంకరయ్య తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకిలీ ఎరుకల కుల ధ్రువపత్రాలు పొంది లబ్ధి పొందుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యపై ఈ నెల 24న తలపెట్టిన చలో విజయవాడకు పెద్ద ఎత్తున ఎరుకలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంజనేయులు, వెంకటేష్, వెంకటరమణ, మలోజ్ హనుమంతప్ప పాల్గొన్నారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఓ విద్యార్థి వైద్య ఖర్చుల కోసం క్రీస్తు జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థుల నుంచి సేకరించిన డబ్బులను శనివారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు బాధిత విద్యార్థి తండ్రికి అప్పగించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన గౌతమ్ సోమందేపల్లి జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల్లో ఆడుకుంటూ కింద పడడంతో తలకు గాయమైంది. అతడికి మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించగా ఆపరేషన్‌కు రూ. 10 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో స్పందించిన సోమందేపల్లి క్రీస్తు జ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సేకరించిన రూ. 30,500 ప్రిన్సిపల్ ప్రసాద్ ద్వారా విద్యార్థి తండ్రి జయకృష్ణాచారికి అందజేశారు.

'ఉపాధి' కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి-గాండ్లపెంట

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో అక్రమాలను అరికట్టేందుకు నూతన విధానాన్ని అమలు చేస్తున్నట్లు శనివారం ఎపిఒ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డ్ ఉన్న కూలీలందరికీ ఐరిష్ ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. కావున జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఐరిష్ ఈకేవైసీ నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఇకపై ఈకేవైసీ చేయించుకున్న వారు మాత్రమే పనులకు వెళ్లాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపాధి హామీ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు వైసిపి రచ్చబండ

ప్రజాశక్తి-అమరాపురం

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో వైసిపి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు త్రిలోక్ తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఉషశ్రీచరణ్, హిందూపూర్ పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి, మడకశిర నియోజకవర్గ కన్వీనర్ ఈరలక్కప్ప హాజరవుతా రన్నారు. కావున వైసిపి శ్రేణులు పెద్దఎత్తున హాజరైన జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దాం

ప్రజాశక్తి-రొద్దం

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దాం.. ట్రంప్ అడుగులకు మడుగులొత్తే ప్రధాని మోడీ లొంగుబాటు విధానంపై పోరాడుదాం అని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ అంశంపై శనివారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బహుళ ధ్రువ ప్రపంచ దిశగా విదేశాంగ విధానం మారాలన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్యయుద్ధం భారత్‌తో సహా ప్రపంచ దేశాలన్నింటిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రధానంగా వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసిందని, పారిశ్రామిక ఉత్పత్తిని దెబ్బతీసిందన్నారు. అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దాం అన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

'సోలార్' తో ఆదాయం : మంత్రి

ఎపి ఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ.. నేడు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

సోలార్ విద్యుత్‌తో ఇంటి అవసరాలు తీర్చుకోవడంతో పాటు ఆదాయం ఆర్జించవచ్చని మంత్రి ఎస్.సవిత తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగంపై శనివారం ఎపి ఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ చేపట్టిన అవగాహన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటిపై సోలార్ ప్యానళ్లు బిగించుకోవాలన్నారు. సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తే ఎలాంటి విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. మిగులు విద్యుత్‌ను విక్రయించి ఆదాయం ఆర్జించవచ్చన్నారు. యూనిట్ సోలార్ విద్యుత్‌ను ప్రభుత్వమే రూ. 2.09తో కొనుగోలు చేస్తుందన్నారు. జగన్ ప్రభుత్వం అయిదేళ్లలో 9 సార్లు వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం మోపిందన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం తొలగించేలా సోలార్ విద్యుత్‌ను తీసుకొచ్చిందన్నారు. రూ. 90 వేల విలువైన కిలో వాట్ సోలార్ ప్యానళ్లపై రూ. 30 వేలు, రూ. 1.2 లక్షల విలువైన 2 కిలో వాట్ సోలార్ ప్యానళ్లపై రూ. 60 వేలు, రూ. 2.20 లక్షల విలువైన 3 కిలో వాట్ సోలార్ ప్యానళ్లపై రూ. 70 వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచిగా ఉచితం అన్నారు. బిసిలకు రూ. 20 వేలు అదనపు సబ్సిడీ లభిస్తుందన్నా రు. సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు ఎలాంటి ష్యూరిటీలు లేకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయన్నారు. బ్యాంకు రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందన్నారు. రూపాయి ఖర్చు లేకుండానే ఇళ్ల సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పట్టణంలోని విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయ ఆవరణలో ఆదివారం 70 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ స్వాతి, ఎంపిడిఒ, నరేష్‌కృష్ణ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రామకృష్ణప్ప, సింగిల్‌విండో ప్రెసిడెంట్ పోతిరెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, టిడిపి పట్టణ, మండల కన్వీనర్లు శ్రీరాములుయాదవ్, ఈశ్వరప్రసాద్, త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, రఘువీరాచౌదరి, రామకృష్ణ, ఎపి ఎస్‌పిడిసిఎల్ అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌పై చేపట్టిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత, టిడిపి శ్రేణులు

సోలార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి :కమిషనర్

మడకశిర టౌన్ : సోలార్ విద్యుత్ ఉత్పాదనలపై ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించిందని, కావున ప్రతి ఒక్కరూ తమ గృహ అవసరాల కోసం విద్యుత్ వినియోగం బదులుగా సోలార్ విద్యుత్‌ను ఉపయోగించుకోవాలని కమిషనర్ పగడాల జగన్నాథ్ సూచించారు. స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి రాజీవ్ గాంధీ సర్కిల్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'పిఎం సూర్య ఘర్'లో భాగంగా సోలార్ వినియోగంపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. అలాగే 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర' ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక కొత్త మార్కెట్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యుత్ డిఈ రఘు, ఏఈ విశ్వనాథ్, మున్సిపల్ మేనేజర్ చంద్రమౌళి, కార్యాలయ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిఓ నాగేశ్వరి, ఆర్పీలు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యసాధన

అజిత్ కుమార్

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అజీత్ కుమార్, బిట్ కళాశాల చైర్మన్, కళాశాల అధ్యాపకులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టుదలతో ముందుకు సాగితే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించగలమని విడిఎం ఇండియా ఆన్ ద మూవీ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అజిత్ కుమార్ విద్యార్థులకు సూచించారు. సువర్ణ భారతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వాసవి ధర్మశాలలో విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళిక... రానున్న పరీక్షలకు సన్నద్ధం.. క్రమశిక్షణ, పట్టుదల అంశాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల సెక్రటరీ అనిల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన విడిఎం ఇండియా ఆన్ మూవీ స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ అజిత్ కుమార్, బిట్ కళాశాల ఛైర్మన్ చంద్రమోహన్, ప్రిన్సిపల్ రమేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజిత్ కుమార్ మాట్లాడుతూ లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదల విజయాన్ని అందిస్తుందన్నారు. బలహీనపరిచే ఆలోచనలను తిరస్కరించాలన్నారు. అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకు విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. అనంతరం వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందించారు. బిట్ కళాశాల ఛైర్మన్ చంద్రమోహన్ విద్యార్థులను వివిధ ప్రశ్నలను అడిగి వాటికి సరైన సమాధానం చెప్పిన వారికి వివేకానంద పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షామీర్, చైతన్య, రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగు పరచండి : సిపిఎం

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మేజర్ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఇటీవల స్థానిక మార్కెట్ రోడ్డులో బైక్ అదుపుతప్పి కింద పడడంతో కెనరా బ్యాంకు ఉద్యోగి మృతి చెందాడన్నారు. ఇందుకు పారిశుధ్యం నిర్వహణలో లోపమే కారణమన్నారు. మార్కెట్ రోడ్డులో వారపు సొంత రోజు కుళ్లిన కూరగాయలు, రాళ్లు, అట్టలు, రోడ్డుపై వేస్తుంటారని, వాటిని తొలగించడంలో గ్రామపంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనికి తోడు మార్కెట్ పరిసరాల్లో నిత్యం పశువులు సంచరిస్తుంటాయ న్నారు. ఒకరి మృతికి కారణమైన పంచాయతీ అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపిడిఒ వెంకటలక్ష్మమ్మకు వినతి పత్రం అందజేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఆ సంఘటనపై తప్పకుండా విచారించి భవిష్య త్తులో ఇలాంటివి జరగకుండా బాధ్యత వహిస్తామని తెలిపారు. అలాగే వ్యాపారులతో మాట్లాడి వ్యర్థాలు రోడ్డుపై లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికుల కొరత వల్ల పారిశుధ్య నిర్వహణను పూర్తిస్థాయిలో చేపట్టలేకపోతున్నామన్నారు. కార్మికుల నియామకం కోసం ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, గోవిందప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా వెంకటేశులు, నాగభూషణ, రవి, కిష్టప్ప, కల్లుగీత కార్మిక సంఘం మండల నాయకులు కిష్టప్ప, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మాబూ, మండల నాయకులు సంజీవప్ప, మాధవ్, జింకా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి నాయీబ్రాహ్మణుల వినతి

పెనుకొండ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నాయీ బ్రాహ్మణులు మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద ధన్వంతరి జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి సవిత ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థినులకు అవగాహన

సోమందేపల్లి : మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలకల విద్యాలయలో శనివారం విద్యార్థినులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్‌బాబు విద్యార్థినులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, శక్తి యాప్, డయల్ 100, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ, ఉపాధ్యాయులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదు కునేది టిడిపి మాత్రమేనని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం శ్రీరామ్ 25 మంది లబ్ధిదారులకు రూ. 22.41 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగా ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తుందన్నారు. అనుకోని పరిస్థితుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీమా సౌకర్యం తీసుకొచ్చారన్నారు. మండలంలోని పోతుకుంట బిసి కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త గుజ్జల నరసింహులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, ఆయనకు పార్టీ సభ్యత్వం ఉండడంతో ఆయన భార్య లక్ష్మికి పార్టీ తరపున రూ. 5 లక్షలు అందజేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు పరిసే సుధాకర్, చింతలపల్లి మహేష్‌చౌదరి, రాళ్లపల్లి షరీఫ్, కమతం కాటమయ్య, నాగూర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

గోరంట్ల : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం టిడిపి మండల నాయకులు స్కూల్ డైరీలు పంపిణీ చేశారు. టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి మాట్లాడుతూ ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్, మంత్రి సవిత సహకారంతోనే విద్యార్థులకు ఈ డైరీలను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, సంతోష్, గిరిధర్‌గౌడ్, అజ్మతుల్లా, నరేష్, నబిరసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

డివిజన్ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-హిందూపురం

కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను పాఠశాల హెచ్‌ఎం శోభారాణి సమక్షంలో శనివారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. వాలీబాల్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన విద్యార్థులను డివిజన్ స్థాయికి ఎంపిక చేశారు. కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో అండర్ 17 బాలుర విభాగంలో నిశాంత్, శరత్ బాబు, బాలికల విభాగంలో బేబీ, మహితలు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల పీడీలు సురేష్ కుమార్, నాగమణి, శ్రీరామ నాయక్, రంగస్వామి, సావిత్రి, శ్రీదేవి, ఇజాజుల్లా, రమణ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహం నిర్మిస్తాం

మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం



విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్, బాలయ్య పీఏ బాలాజీలు

విద్యార్థులు ఎటువంటి ఆందోళనలకు గురి కావొద్దని, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నేతత్వంలో నూతన పాలిటెక్నిక్ విద్యార్థుల వసతి గృహాన్ని నిర్మిస్తామని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు విద్యార్థుల వసతి గహంలోకి చొరబడినట్లు తెలుసుకున్న ఆయన ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీతో కలిసి శనివారం నాడు వసతి గహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే 300 మంది విద్యార్థినులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అనుకూలంగా వసతి గహం నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

ధన్వంతరి మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఛైర్మన్

ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి మహర్షి అని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని త్యాగరాజు నగర్ నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ధన్వంతరి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణ, మూర్తి, ఖలీమ్, రమేష్, శ్రీధర్, మంజు, నాగేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రతి విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించాలని, ప్రతి అంశాన్ని పరిశీలనాత్మకంగా, హేతుబద్ధంగా చూడాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బషీర్ సూచించారు. పట్టణంలోని గణేష్ మున్సిపల్ హైస్కూల్లో శనివారం ఇన్‌ఛార్జి హెచ్‌ఎం లక్ష్మయ్య అధ్యక్షతన జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బషీర్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. దేనినీ గుడ్డిగా నమ్మకుండా విభిన్నంగా ఆలోచించినప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి బషీర్ మాట్లాడుతూ దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం, కరువు కాటకాలు పోయి దేశ ప్రజల్లో గుణాత్మక మార్పు రావాలంటే సైన్స్ అభివృద్ధితోనే సాధ్యం అన్నారు. సైన్స్ పేరుతో సూడో సైన్స్‌ను ప్రచారం చేస్తూ ప్రజలను అజ్ఞానం వైపు తీసుకుపోవాలని చేసే ప్రయత్నాన్ని తిప్పి కొట్టాలన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.లోకేష్ మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాస్త్రీయ మార్గం చూపేది ఒక్క సైన్స్ మాత్రమే అన్నారు. హెచ్‌ఎం లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, మూఢనమ్మకాలను తొలగించడానికి [illegible] నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో మన పాఠశాల భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికృష్ణ, రామకృష్ణ, హనుమంత, రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న జెవివి నాయకులు

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

హిందూపురం : విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. రూరల్ మండలంలోని కె.బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు చైతన్య గంగిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రరెడ్డి, విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు అశోక్, గురుమూర్తి, రఘు, వినుత, విజయ, కల్పన, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు రాజ శేఖర్ రెడ్డి పాల్గొని చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహణపై విద్యార్థులకు తెలిపారు. ప్రశ్నించడం ద్వారా విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు కొత్త ఆవిష్కరణలు చేయగలరన్నారు. మూఢనమ్మకాలు వదిలి శాస్త్రీయ ఆలోచనలు చేయాలని సూచించారు. పరీక్షల్లో పాఠశాల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎం.గణేష్, ఎస్.సాధిక, బి.వర్షలు మండల స్థాయికి ఎంపికయ్యారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర'లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ప్రజాశక్తి-నల్లమాడ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించి పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర'లో భాగంగా శనివారం వారు స్థానిక జడ్పీ హైస్కూల్, కెజిబివిలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటు చేయడమే ధ్యేయమన్నారు. సోలార్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కెజిబివి ప్రాంగణంలో మొక్కలు నాటి విద్యార్థినులతో పాటు మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం చౌటుకుంటపల్లి రైతు పద్మనాభరెడ్డి పొలంలో మొక్కలు నాటారు. అలాగే గ్రామంలో మొక్కలు పంపిణీ చేశారు. వారి వెంట మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, మండల అధికారులు, ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు ఉన్నారు. రైతుల పాసుబుక్కులు, వీధిలైట్లు, తాగునీటి సమస్యలపై సిపిఎం మండల నాయకులు గోవిందు, వెంకటరాముడు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

తాడిమర్రి : మండలంలోని నిడిగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం, చెన్నకేశవస్వామి మాన్యం, కునుకుంట్ల జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మండల స్పెషల్ ఆఫీసర్, డ్వామా పిడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరంగారావు, తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఫమీదాపర్వీన్, ఏపీవో అనిల్‌కుమార్ రెడ్డి, ఎపిఎం సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శులు హేమావతి, వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడలో మొక్కనాటి నీరు పోస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి

మొక్క నాటుతున్న పీడీ నరసయ్య

ఎంజెపి పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలను శుక్రవారం రాత్రి మండల స్పెషల్ ఆఫీసర్, డిఆర్‌డిఎ పిడి నరసయ్య సందర్శించి తరగతి గదులు, భోజనశాల, మరుగుదొడ్లు, వసతులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల మధ్యనే నిద్రించారు. శనివారం ఉదయం పాఠశాలలోనే స్నానమాచరించారు. పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, అందిస్తున్న విద్యపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కెజిబివి పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థినులతో ముచ్చటించారు. పాఠశాల పరిశుభ్రత, భోజనశాల బాగున్నాయని ప్రిన్సిపల్‌ను ప్రశంసించారు. ఆయన వెంట ఆయా పాఠశాల ప్రిన్సిపల్స్ అనిత, నాగారత్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్టేజ్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్టేజ్ నిర్మాణానికి శనివారం హెచ్‌ఎం గోపాల్, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకన్న భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రిటైర్డ్ హెచ్‌ఎం ఎన్‌సి.నరసప్ప, వారి కుటుంబ సభ్యులు స్టేజీ నిర్మాణానికి నిధులు అందజేశారని తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, విశ్వేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మండల అధ్యక్షుడిగా తిరుపాల్‌యాదవ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ తెలుగు రైతు సంఘం మండల అధ్యక్షులుగా వై.కొత్తపల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు తిరుపాల్‌యాదవ్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వహించి రైతాంగం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, తన ఎన్నికకు సహకరించిన టిడిపి మండల కన్వీనర్ చెన్నకేశవులు, నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

దీపావళి సందర్భంగా స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉపసర్పంచి కోటి గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అహర్నిశలు కష్టపడుతూ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల సేవలు ఎనలేనివని కొనియాడారు.

ఆముదం పంట పరిశీలన

నల్లచెరువు : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన ఆముదం పంటను శనివారం అనంతపురం జిల్లా రేకులకుంట శాస్త్రవేత్త రాధాకుమారి, డాక్టర్ విజయ్ శంకర్ బాబు పరిశీలించారు. రైతు కృష్ణమూర్తి సాగుచేసిన ఆముదం పంటను పరిశీలించి సంతృప్తిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఈవో వెంకటేష్, సిసిఒ బాలకృష్ణారెడ్డి, ఎంసిఒ శ్రీనివాసులు, నాగరాజు, విసిఒ నీలకంఠేశ్వర, ఆతియా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, HINDUPUR
O.S.No:144/2022

Between:
N.S.Gangadharaiah Guptha ...Plaintiff
AND
Y.Vijayalakshmi ...Defendant

NOTICE TO THE DEFENDANT

శ్రీమతి Y.విజయలక్ష్మీ W/o Late Y.లక్ష్మన్న వయస్సు 55 సం॥లు R/o D.No.19-8-92, S.N.పేట, హిందూపురం టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా (A.P) అను మీరు పై కేసు నందు ప్రతివాదిగా వున్నారు. ఈ కేసు నందు మీరు సమన్లు తీసుకోవడం లేదు. ఉద్దేశ్యపూర్వంగా సమన్లను తీసుకోవడం లేదని భావించిన పిదప పై గౌ॥కోర్టువారు పత్రికా ముఖముగా సమన్లు జారి చేయుటకు అంగీకరించి ఉత్తర్వులు జారీ చేసినారు. కావున మీరు ఈ నెల 24-10-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై గౌ॥కోర్టు ముందు మీ వకీలు ద్వారా గాని, స్వయంగా గాని హాజరై కేసు నడుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ పరచడమైనది.

(కోర్టు ఉత్తర్వులకు అనుసరించి ఈ ప్రకటన ప్రచురించడం జరిగినది)

తేది: 24-10-2025.
స్థలం: హిందూపురం

కే.సి.కృష్ణారెడ్డి,
న్యాయవాది, హిందూపురం-515201

అనధికారికంగా టపాసులు విక్రయిస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రభుత్వ అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ హెచ్చరించారు. టపాసులు విక్రయించే ప్రదేశాల్లో అన్ని జాగ్రత్తలు, సూచ నలు పాటించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాలకు తావు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలని దుకాణదారులకు సూచించారు. నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. కేటాయించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయించాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లైసెన్స్ కల్గిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయించాలన్నారు. ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తుంటే 112 లేదా 100, పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్న షెడ్లను ఆర్డీవో మహేష్ తనిఖీ చేశారు. టపాసులు నిల్వ చేయడం, విక్రయించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలని సూచించారు. అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇసుక, నీరు, తదితర సామగ్రి తప్పనిసరిగా ఉండాలన్నారు. దరఖాస్తుదారులు చలానాతో పాటు జీఎస్టీ చెల్లించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ సురేష్‌బాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ సాయికృష్ణ, పోలీసులు ఉన్నారు.

కొత్తచెరువు : ప్రభుత్వ నిబంధనల మేరకే వ్యాపారులు బాణసంచా అమ్మకాలు చేపట్టాలని సిఐ మారుతిశంకర్ ఆదేశించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో దుకాణదారులకు సిఐ పలు సూచనలు చేశారు. అన్ని జాగ్రత్తలు పాటిస్తూ నిర్ణీత ధరకే విక్రయించాలన్నారు.

మద్యం అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-హిందూపురం

కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాలోకి వచ్చే అక్రమ మద్యం రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.శ్రీరామ్ సిబ్బందిని ఆదేశం చారు. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చిలమత్తూరు మండలం బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి కొడికొండ చెక్ పోస్ట్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్ణాటక రాష్ట్ర అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే చర్యలు తీసుకోవాల న్నారు.

కొడికొండ చెక్ పోస్టులో తనిఖీలు చేస్తున్న డిసి

మద్యం దుకాణాల తనిఖీ

పెనుకొండ : పెనుకొండ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలను శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య తనిఖీ చేశారు. మద్యం షాపుల్లో ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిళ్లను స్కాన్ చేసిన తర్వాత అమ్ముతున్నారా లేదా అని పరిశీలించారు. మద్యం సీసాలను సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసిన తర్వాతనే విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు. అనంతరం మద్యం వినియోగదారులకు సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేయించి ఎలా స్కాన్ చేయాలో అవగాహన కల్పించారు. ఆయన వెంట అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఈఎస్ శ్రీరామ్, పెనుకొండ సిఐ సృజన్‌బాబు, ఎస్‌ఐలు రాజశేఖర్, రాముడు, సిబ్బంది ఉన్నారు.

అనుభవంలో ఉన్న మేరకే స్కెచ్ ఇవ్వాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని మాగేచెరువులో శనివారం చేపట్టిన భూ సర్వేపై రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఒకరిద్దరికీ అనుకూలంగా ఉండేటట్లు సర్వే చేశారని, ప్రస్తుతం సాగులో ఉండే విధంగానే స్కెచ్ వేసి ఇవ్వాలని కోరుతూ రైతులు డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్ కు వినతిపత్రం ఇచ్చారు. రైతులు పెద్దింటి సత్తి, నాగరాజు, తిమ్మప్ప, నారాయణప్ప, బాబు, ఆకుల నరసింహులు, కొల్లప్ప, తదితరులు తెలిపిన వివరాలు.. మాగేచెరువు గ్రామంలో 164 సర్వే నంబర్‌లో 18-85 ఎకరాల పట్టా భూమి ఉంది. వంశపారంపర్యంగా కొందరు కొనుగోలుతో వచ్చిన భూములను 12 మందితో పాటు మరికొందరు సాగు చేసుకొంటున్నారు. ఈ క్రమంలో శనివారం తహశీల్దార్ మారుతి సమక్షంలో మండల సర్వేయర్ వినోద్‌కుమార్‌రెడ్డి పొలాలను సర్వే చేశారు. అయితే గతంలో సాగులో ఉన్న మాదిరి కాకుండా కేవలం ఒకరిద్దరికి ఉపయోగపడేలా సర్వే చేశారని, దీనివల్ల సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు పేర్కొన్నారు. అలా కాకుండా గతంలో సాగులో ఏవిధంగా ఉన్నామో ఆ విధంగానే సర్వే చేసి స్కెచ్‌లు ఇవ్వాలని రైతులు డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. వినతి ఇచ్చిన వారిలో రైతులు రంగప్ప, నల్లప్ప, కుళ్లాయప్ప, ఆనంద్ కుమార్, వెంకటేశులు, చిన్నప్ప, ఆదినారాయణ, నరసప్ప, అంజనప్ప, రత్నమ్మ, కొల్లప్ప, ఆనంద్, తిమ్మప్ప, తదితరులు ఉన్నారు.

కాలుష్య రహిత జీవనంతో ఆరోగ్యం : ఎడిజె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

కాలుష్యం లేకుండా జీవనం సాగించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. ద్విచక్ర వాహనం, కార్లు లేకుండా న్యాయమూర్తులు, న్యాయస్థానాల సిబ్బంది శనివారం విధులకు హాజరయ్యారు. అనంతరం కాలుష్య రహిత సమాజం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయస్థానం పరిపాలనాధికారి సుధాకర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ ఉమాదేవి, న్యాయవాదులు రాజశేఖర్, అజయ్ పాల్గొన్నారు.



కాలుష్య నివారణపై చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న జడ్జి శైలజ, లాయర్లు

దీపావళి వెలుగులు నింపాలి: నవీన్ నిశ్చల్

ప్రజాశక్తి-హిందూపురం

దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగు నింపాలని మాజీ ఆగ్రోస్ ఛైర్మన్ బి.నవీన్ నిశ్చల్ ఆకాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని డాక్టర్ బివి సాయిప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవీన్ మిత్రమండలి సభ్యులకు మిఠాయిలు, బాణసంచా పంచి పెట్టారు. ఈ సందర్భంగా నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ చీకటిని చీల్చి, వెలుగులు అందించే పండుగ దీపావళి అన్నారు. టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్త పాటించాలని సూచించారు.

కార్యకర్తలకు టపాసులు పంపిణీ చేస్తున్న నవీన్ నిశ్చల్

ఫ్లెక్సీ చించివేత దుర్మార్గం

రొద్దం : పెనుగొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్‌ఆర్ సర్కిల్ సమీపంలోని తిరుమల ఫర్టిలైజర్స్ షాపు ముందు ఓ ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. అందులో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సిద్దన్న ఫొటోకు గుర్తుతెలియని వ్యక్తులు బురదను పూసి చించివేశారు. దీంతో సిద్దన్న మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారని పేర్కొన్నాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా టిడిపి వారు వేసిన ఫ్లెక్సీల్లో తన ఫొటో చించి వేశారని వాపోయాడు. చించివేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. అలాగే టిడిపి మండల నాయకులు మాధవనాయుడుకు ఈ విషయాన్ని తెలిపినట్లు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న మహిళ

'నా కుమారుడిపై కేసు పెట్టొద్దు'

పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఓ మహిళ బ్లేడుతో గొంతు, చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య గత శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుంది. ఆ ఘర్షణలో ఓ విద్యార్థికి గాయాలు కాగా బాధిత మహిళ ముబీనా కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే గాయపడిన ఆ విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ముబీనా కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ముబీనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి 'నా కొడుకు భవిష్యత్తు దెబ్బతింటుంది.. కేసు నమోదు చేయవద్దు' అని ప్రాధేయపడింది. పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో వెంట తెచ్చుకున్న బ్లేడుతో ఆమె పోలీస్ స్టేషన్‌లోనే తన గొంతు, చెయ్యి కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో పోలీసులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు ఆమెకు ప్రమాదమేమీ లేదని తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-మడకశిర టౌన్

మండలంలోని ఛత్రం పంచాయతీ పరిధిలోని ఈచలడ్డి గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు మనోజ్(15) బుల్లసముద్రం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మనోజ్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మనోజ్ మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

అదుపు తప్పి ఆటో బోల్తా

రొద్దం : మండలంలోని పాతర్లపల్లి గ్రామం వద్ద శనివారం పెనుగొండ-పావగడ ప్రధాన రహదారిపై అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆటో పాతర్లపల్లి వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ ట్యాక్ చేస్తుండగా పావగడ వైపు నుంచి వస్తున్న కారును తపించే క్రమంలో అదుపుతప్పి కల్వర్ట్ కిందకు పడింది. ఈ ఘటనలో ఆటోలో వెళ్తున్న ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిలో ఓ వృద్ధురాలు ఉండగా స్థానికుల సాయంతో పెనుకొండ ఆసుపత్రికి తరలించారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలోని పోతులకుంట గ్రామంలో శనివారం పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై నేరాలను అరికట్టడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. మద్యం తాగి వాహనం నడపకూడదన్నారు.

కొత్తచెరువు మండలం పోతులకుంటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

ధర్మవరం రూరల్ : గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ప్రశాంత జీవనం సాగించాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని పోతులనాగేపల్లి గ్రామంలో శనివారం ప్రజలతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాల న్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలన్నారు. మట్కా, పేకాట, జూదం, తదితర చట్టవ్యతిరేక కార్యక్రమాల జోలికి వెళ్లవద్దన్నారు. మద్యానికి బానిస కాకూడదని సూచించారు.

ముదిగుబ్బ : మండలంలోని ఇందుకూరు గ్రామంలో ఎస్‌ఐ శివరాముడు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని సూచించారు. సైబర్ క్రైమ్, తదితర నేరాలు జరగకుండా అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు.

'పాంచజన్య'లో దీపావళి సంబరాలు



హిందూపురంలోని పాంచజన్య పాఠశాలలో దీపం ఆకృతిలో ఏర్పడిన విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

కాలుష్యాన్ని నివారించడానికి దీపాలతో దీపావళి నిర్వహించుకోవాలని పాంచజన్య శ్రీనివాసులు పిలుపునిచ్చారు....దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ ఉన్నత పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా దీపాలను వెలిగించి, వాటిని ప్రదర్శించి కాలుష్య నివారణ కోసం దీపాలతోనే దీపావళిని నిర్వహించుకుందామని ఉపాధ్యాయులు, చిన్నారులు సమాజానికి సంకేతం ఇచ్చారు. అనంతరం పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ టపాసుల ద్వారా వెదజల్లే కాలుష్యం వాతావరణంకు చేటు చేస్తుందన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడాని దీపాలతోని దీపావళిని నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, ఏఓ భాస్కర్, హెచ్‌ఎం గాయత్రి, పాఠశాల సూపరిటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రగతి, గ్లోబల్ జెన్'లో..

పెనుకొండ : పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల్లో శనివారం ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి పండుగ అన్నారు. విద్యార్థులు తమలోని అజ్ఞానాన్ని తొలిగించుకొని విజ్ఞానవంతులుగా మారాలని సూచించారు. అలాగే దీపావళి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. చిన్నారులు ప్రత్యేక వస్త్ర ధారణలో పాఠశాలకు హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు మతాబులు వెలిగించి దీపావళి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజువాణి, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, డైరెక్టర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండలోని ప్రకాష్ జెన్ పాఠశాలలో దీపావళి సంబరాల్లో పాల్గొన్న కరస్పాండెంట్ శ్రీనివాసులు

జూనియర్ కాలేజీ రస్తాకు సర్వే

ముదిగుబ్బ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు దగ్గరలో ఎన్‌హెచ్-342 పోతుండటంతో ఉన్న పాత రస్తాను తవ్వి వేయడంతో సుమారు 50 అడుగులకు పైగా అగాధం ఏర్పడింది. దీంతో విద్యార్థులు, సిబ్బంది దూరంగా ఉన్న పంట పొలాల మీదుగా రాళ్ల దారిలో పాఠశాలకు రాకపోకలు సాగించేవారు. ఈ క్రమంలో వారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో సురక్షతమైన బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు ఎన్‌హెచ్ వారు ముందుకొచ్చారు. అందుకోసం భూమి సర్వే చేసి ఇవ్వాలని కోరారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ రస్తా కోసం సర్వే చేయాలని ఆదేశించారు. దీంతో శనివారం మండల సర్వేయర్ సుశాంతి, సిబ్బంది భూమి సర్వే చేపట్టారు. వారితో పాటు ప్రిన్సిపల్ రామరాజు, సచివాలయ సర్వేయర్ మనోహర్, గుంజేపల్లి సర్వేయర్ ధనుంజయ, ఎన్‌హెచ్ ఇంజినీర్లు, రైతులు ఉన్నారు.

విజయవంతంగా ఐద్వా మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభకు అనంతపురం వేదికైంది. ఈ వారంలో మూడు రోజులపాటు అనంతపురం నగరంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు ఎంతో ఉత్సహపూరిత వాతావరణంలో జరిగాయి. రాష్ట్రంలో మహిళా సమస్యలను చర్చించడంతో పాటు, వారి సమస్యలపై రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టాల్సిన పోరాట వ్యూహాలను రచించారు. ప్రధానంగా రాష్ట్రంలో మహిళలు పడుతున్న ఇబ్బందుల్లో రుణభారాలపై ఎక్కువగా చర్చకొచ్చింది. మైక్రోఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని మహిళలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని ఈ మహాసభలో చర్చకొచ్చింది. మహిళల ఆర్థికాభివృద్ధికి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసామని పాలకులు చెబుతున్నా ఆచరణలో పరిస్థితి భిన్నంగా ఉందన్న అంశం చర్చకొచ్చింది. డ్వాక్రాలోనూ రెండు రూపాయలకుపైగా వడ్డీ పడుతోందని ఐద్వా ప్రతినిధుల చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మహిళలను ఈ సంఘాలు పీక్కుతీనేవిగా మరాయని ఆందోళన వ్యక్తమైంది. ప్రభుత్వం రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలందివ్వాలని మహాసభ డిమాండ్ చేసింది. ఇది టిడిపి ఎన్నికల హామీలోనూ ఉందని గుర్తు చేశారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.1500 ఇస్తామన్నది అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక మహిళపై జరుగుతున్న హింస అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపైన ఈమూడు రోజుల మహాసభ చర్చించింది. ఈ మహాభలో జాతీయ నాయకులు ఆసాంతం పాల్గొని దిశా నిర్దేశం చేయడం గమనార్హం. సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇక జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి శ్రీమతి టీచరు, మరియం ధావలే, పుణ్యవతి పాల్గొన్నారు. ఈ మూడు రోజులు ప్రతినిధులు ఎంతో ఉత్సహంతో పాల్గొని రాష్ట్రంలోని మహిళల సమస్యలపై చర్చించారు. రాబోయే మూడేళ్లు కావాల్సిన కార్యాచరణ రూపొందించారు.

ఈ వారం రబీ పంటలసాగుపై చర్చకొచ్చింది. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో పంటల సాగు ఆశించినంత జరగలేదు. సీజన్ మొత్తంలో ఆగస్టు ఒక్కటే వర్షపాతం నమోదైంది. అది కూడా ఆ నెలలో 90 శాతంపైన వర్షపాతం నమోదైంది. తక్కిన అన్ని నెలలు వర్షాభావమే నెలకొంది. దీంతో అటు ఖరీఫ్‌లోనూ, ఇటు రబీలోనూ పంటల సాగు ప్రశ్నార్థకమే అయింది. ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. సీజన్‌లో పడకపోవడంతో ప్రధాన పంట వేరుశనగ సాగు చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయమైన ఇచ్చి రైతులను ఆదుకునే వారు ఈసారి ప్రత్యామ్నాయం ఊసే లేకుండా చేశారు. ఇక రబీలోనూ పప్పుశనగపై దృష్టి సారించలేదు. ఈ సీజన్‌లో వర్షాలు లేకపోవడంతో రబీలోనూ పంటల సాగు ఆశించినంత ఉండే అవకాశం లేదు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పెద్దఎత్తున వర్షాలు పడుతున్నా అనంతపురం జిల్లాలో మాత్రం వర్షపాతం సరిగా లేదు. కారు మబ్బులు కమ్ముకుని రావడం, కొద్దిసేపు తేలికపాటి వర్షం పడిపోతోంది. దీని మూలంగా పదును లేక పంటలు సాగవడం లేదు. ప్రధాన నదుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలుకు నీరు బాగా వస్తోంది. ఈనీటి వినియోగంపై ఈసారి ఇప్పటి వరకు సాగునీటి సలహా మండలి సమావేశమే నిర్వహించలేదు. దీన్ని బట్టి ప్రభుత్వానికి వ్యవసాయంపై ఏ మేరకు శ్రద్ధ ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.